ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శుక్రవారం 19 ఏప్రిల్ 2024

ఆట మొదలైంది

- శ్రేణులు, నాయకుల సమన్వయంపై కాంగ్రెస్ ఫోకస్
- నేడు మహబూబాబాద్‌లో, 24న వరంగల్‌లో సీఎం రేవంత్ సభలు
- బూత్ స్థాయి కేడర్‌పై బీజేపీ దృష్టి
- కంచుకోటను కాపాడుకునే ప్రయత్నంలో గులాబీ పార్టీ
- నియోజకవర్గాల బాధ్యతలు ఎమ్మెల్సీలు, సీనియర్లకు..
- ఓరుగల్లుపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల గురి



'లోక్‌సభ' పోరులో గెలుపే లక్ష్యంగా పార్టీల వ్యూహాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

నామినేషన్ల పర్వం మొదలైంది. పార్టీలు సమరానికి సై అంటున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార పర్వంలోకి దిగడంతో పాటు ఓ వైపు కేడర్‌ను కలుస్తూ.. మరోవైపు ప్రజల్లోకి వెళ్తూ గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ క్రమంలోనే ఆయా పార్టీల అధినాయకత్వాలు కూడా తమ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలకు పదను పెడుతున్నాయి. లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు ప్రత్యర్థి పార్టీల నుంచి శ్రేణుల చేరికల పై దృష్టి సారిస్తున్నాయి. రాష్ట్ర, జాతీయ నాయకులతో రోడ్ షోలు బహిరంగ సభలకు పార్టీలు ప్లాన్ చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

కేడర్‌లోకి హస్తం నేతలు

ఉమ్మడి వరంగల్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టిన కాంగ్రెస్.. బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో పాగా వేసేందుకు వ్యూహరచన చేస్తోంది. 2014 నుంచి తమ చేతికి చిక్కని ఓరుగల్లులో పాగా వేయాలని ప్రణాళిక రచిస్తోంది. వరంగల్ లోక్‌సభ స్థానాన్ని గులాబీ పార్టీ నుంచి చేజిక్కించుకునేందుకు వలసలపై దృష్టి పెట్టింది. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులతో పాటు 20మందికి పైగా కార్పొరేటర్లు, ముగ్గురు మున్సిపల్ చైర్మన్లను బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. అంతేగాకుండా స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకుని ఆయన కుమార్తె కడియం కావ్యకు ఎంపీ టికెట్ ఇచ్చింది. దీంతో కడియం శ్రీహరి తన కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముఖ్య నాయకులను కలిసి తమ గెలుపునకు సహకరించాలని కోరుతూనే నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు కొత్త అయిన కడియం కావ్యను కేడర్‌లోకి తీసుకెళ్తూ జోష్ నింపుతున్నారు. కావ్య ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయడంతో పాటు సాయంత్రం 4గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే మడికొండ బహిరంగ సభ ద్వారా సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేస్తున్న బలరాంనాయక్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇప్పటికే లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించిన బలరాం నాయక్.. శుక్రవారం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటుండటంతో శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు బలరాంనాయక్ ప్రయత్నిస్తున్నారు. అలాగే పార్టీ అధిష్ఠాం వరంగల్, మహబూబాబాద్ పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు కో ఆర్డినేటర్లను నియమించింది. ఎప్పటికప్పుడు కో ఆర్డినేటర్లు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతూ సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

కేడర్‌పై బీజేపీ నజర్

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలపై బీజేపీ నజర్ పెట్టింది. 1984లో తొలిసారి బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి అప్పటి హనుమకొండ స్థానం నుంచి విజయం సాధించారు. అప్పటి నుంచి పోటీ చేస్తున్న బీజేపీకి వరంగల్ సీటు అందని ద్రాక్షలా మారింది. అయితే 40ఏళ్లకు బీజేపీకి వరంగల్‌లో గెలుస్తామన్న ధీమాతో ఎన్నికల బరిలో దిగుతోంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ ఇచ్చింది. మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్ని నియోజకవర్గాల్లో ప్రచారానికి తిరుగుతున్నారు. ఈ రెండు చోట్ల బీజేపీకి ఉన్న సంస్థాగత బలంతో పాటు మోదీ గాలిలో విజయం సాధిస్తామన్న ధీమాతో ఆ పార్టీ ఉంది. దీంతో బూత్ స్థాయి కేడర్‌పై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రముఖులను నియమించింది. పార్టీలోని కీలక నేతలు ఐక్యతతో పని చేస్తుండటంతో పాటు అనుబంధ సంఘాలు చాపకింద నీరులా విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే వరంగల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాలు నిర్వహించి పార్టీ అభ్యర్థిని పరిచయం చేస్తూ ఈసారి వరంగల్‌లో

మిగతా 7వ పేజీలో..



అధికారులకు సూచనలు చేస్తున్న వరంగల్ కలెక్టర్, ఆర్వో ప్రావీణ్య

తొలి అంకం ప్రారంభం..

మొదలైన 'లోక్‌సభ' నామినేషన్ల పర్వం

- తొలి రోజు వరంగల్‌కు ముగ్గురు, మానుకోటకు ఒకరు దాఖలు
- రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి తొలిఅంకం ప్రారంభమైంది. గురువారం అధికారులు నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో.. నామినేషన్ల దాఖలు ప్రక్రియ షురూ అయ్యింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ (మానుకోట) స్థానాలకు సంబంధించి తొలిరోజు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో వరంగల్ నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు, మానుకోటలో ఒకరు తమ నామపత్రాలను అందజేశారు. వరంగల్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, మానుకోటలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు వరంగల్‌లో అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు బుద్దయ్య, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ ఒక సెట్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థినిగా తౌటపల్లి నర్మద ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇక మహబూబాబాద్ స్వతంత్ర అభ్యర్థిగా మరిపెడ మండలం ఎడ్జర్ల శివారు గుర్రపు తండాకు చెందిన బానోత్ లింగ్యానాయక్ తొలి నామినేషన్ వేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగగా.. రెండు నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. ఆయా పార్టీల అభ్యర్థులు ముహూర్త బలాలు చూసుకుంటున్నారని, 19, 22, 24 తేదీల్లో దాఖలు చేయనున్నట్లు సమాచారం. నామినేషన్ల స్వీకరణకు గాను వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్‌లలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం సమీపంలో 144సెక్షన్ అమలు చేశారు. వరంగల్‌లో నామినేషన్ల స్వీకరణకు ముందు ఏర్పాట్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు తగు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నేతృత్వంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవోలు ఆలివేలు, నర్సింహారావులు ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

బిడ్డపై ఆరాటమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదు..



- ఉద్యకారులను జైలులో వేసిన ఘనత కడియం శ్రీహరిది..
- రాజీనామా చేయకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడు..
- బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

అరూరి రమేశ్ చిన్న మెదడు చితికింది..



- రాజకీయాలను అడ్డం పెట్టుకొని భూకబ్జాలకు పాల్పడ్డాడు..
- ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు తీసుకొస్తా..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- వర్ధన్నపేటలో వరంగల్ లోక్‌సభ సన్నాహక సమావేశం

వివరాలు 7లో..





మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నేడు మానుకోటకు సీఎం

- 'జనజాతర' సభకు రానున్న రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రిగా తొలిసారి రాక
- ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల పర్యవేక్షణలో ఏర్పాట్లు, జన సమీకరణ
- సిద్ధమైన మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం

మహబూబాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. అదే దూకుడుతో పార్లమెంట్ స్థానాలను హస్తగతం చేసుకునేందుకు పార్లమెంటు పోరుకు కాలుదువ్వుతోంది. ఈ క్రమంలో తొలి ఎన్నికల ప్రచార సభకు ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డినే రంగంలో దింపుతోంది. నోటిఫికేషన్ విడుదలవడం, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో.. రెండోరోజు శుక్రవారం ముహూర్తం ఖరారు చేసుకున్న మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తన నామినేషన్ దాఖలు అనంతరం ఈ ఎన్నికల ప్రచారసభను నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మహబూబా బాద్‌కు చేరుకొని, తర్వాత జనజాతర బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఇందుకోసం పార్టీ జిల్లా నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

సెంటిమెంట్‌గా మానుకోట..

మహబూబాబాద్ పార్లమెంట్ ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గ ఆవిర్భావ

మిగతా 7వ పేజీలో..

పంటలను ఎండనివ్వం

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



మండలంలోని కోతులబాద్ వద్ద కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, ఏప్రిల్ 18 : రైతులు అత్యధిక శాతం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నందున ఒక్క ఎకరం వరి కూడా ఎండిపోని వ్వమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొతులబాద్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని కోమటిగూడెం, బోయినిగూడెం గ్రామ శివారులోని దేవాదుల కాల్వలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సరైన ప్రణాళికలు లేకుండానే ఇష్టారాజ్యంగా కాల్వలు తవ్వి వదిలేశారని అన్నారు. ఎలాంటి అవగాహన లేని కారణంగా తవ్విన కాల్వల నుంచి సాగునీరు ఎటువైపు వెళ్లాలో తెలియకుండానే డబ్బుల కోసమే కక్కుర్తి పడినట్లు ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కాల్వలను మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు నిర్లక్ష్యం వల్లనే కాల్వల్లో మట్టి కూరుకుపోయిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్నది రైతు పక్షపాతి ప్రభుత్వమని పేర్కొన్నారు. ఆగస్టు 15 నాటికి రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, జల్గం కుమారస్వామి, కాకిరాల హరిప్రసాద్, మాజీ సర్పంచులు కొంరోజు సోమన్న, నిర్మల, పోగు శ్రీనివాస్, బక్క పుల్లయ్య, బీర్ల సోమేశ్వర్, భాస్కర్, పెనుగొండ రమేష్, మామిండ్ల యాకన్న పాల్గొన్నారు. అనంతరం ఈరవెన్ను గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోతి వెంకన్న అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించారు.

ప్రతీ క్లినిక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18 : క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 ప్రకారం జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు, ఆయుష్ క్లినిక్ లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు జిల్లాలో ఐదు తనిఖీ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రిజిస్టర్ అయిన ప్రైవేటు క్లినిక్‌లలో నియమ నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా రిజిస్టర్ అయిన వాటిలో కాలపరిమితి ముగిసిపోయినవి ఏవైనా ఉన్నాయా.. అనేవి పరిశీలించి బృందంలోని అధికారులు 15 రోజుల వ్యవధిలో నివేదిక అందజేయాలని అన్నారు.

నిరంతర పహారా ఉండాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

జిల్లాలోని పెంబర్తి, మొండ్రాయి చెక్‌పోస్టుల తనిఖీ



పెంబర్తి చెక్‌పోస్టు వద్ద భద్రతా సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18 : చెక్‌పోస్టుల వద్ద నిరంతర పహారా ఉండాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. జనగామ జిల్లా పెంబర్తి చెక్‌పోస్టును గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతా సిబ్బందితో మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. అక్రమ మార్గంలో ఎటువంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభపెట్టే వస్తువులు జిల్లా లోకి రాకుండా వివిధ శాఖల సమన్వయంతో 24 గంటల పర్యవేక్షణలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేపట్టాలని సూచించారు. అనంతరం తనిఖీలు చేసిన వాహనాల నమోదు రిజిస్టర్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా పరిశీలించడంతో పాటు ప్రత్యక్షంగా పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

- కొడకండ్ల : లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన మండలంలోని మొండ్రాయి చెక్‌పోస్టును వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్, స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీల్లో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి నగదు తదితరాలు దొరికినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించారు.

భూనిస్సారం!

- రసాయన ఎరువుల వాడకంతో మారుతున్న నేల స్వభావం
- అధిక దిగుబడి కోసం మోతాదుకు మించి వినియోగం
- జిల్లాలో పెరుగుతున్న ఆమ్ల, క్షార మృత్తికలు
- మూస పద్ధతిని అవలంబిస్తున్న అన్నదాతలు



లింగాలఘణపురం శివారు పంట పొలంలో ఎరువులను చల్లుతున్న రైతు (ఫైల్)

లింగాలఘణపురం, ఏప్రిల్ 18 : పంట దిగుబడి కోసం రైతన్నల అధిక రసాయన ఎరువుల వాడకం అసలుకే ఎసరు పెడుతోంది. ఈ ప్రాంతాలతో తేడా లేకుండా రైతులు మూస పద్ధతిని అవలంబిస్తూ ఇబ్బడి ముబ్బడిగా రసాయన ఎరువులను వాడుతున్నారు. అవసరం లేకపోయినా నత్రజనిని నేలల్లో గుమ్మరిస్తుండటంతో జిల్లాలోని సాగు భూముల స్వభావంలో విపరీత మార్పులు సంభవిస్తున్నాయి. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) స్పేస్ అప్లికేషన్ సెంటర్ విడుదల చేసిన డిసర్టిఫికేషన్ అండ్ ల్యాండ్ డిగ్రేడేషన్ అట్లాస్ వెల్లడించిన ఫలితాలు కూడా అధిక శాతం రసాయన ఎరువుల వాడకంతో అటవీ సంపద తగ్గి భూసారం క్షీణిస్తున్నట్లు స్పష్టం చేస్తున్నాయి.

నేలల ఆరోగ్యంపై దృష్టి సారించని రైతులు

రోజు రోజుకు పెరిగిపోతున్న రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయ భూముల్లో భూసారం తగ్గిపోతోంది. అధిక పంట దిగుబడి కోసం ఇష్టారాజ్యంగా రసాయనాల వినియోగానికి మొగ్గుచూపుతున్న రైతన్న తనకు తానుగా భూసారాన్ని క్షీణింప చేస్తుండటం గమనార్హం ఫలితంగా అధిక భాస్వరం కారణంగా మృత్తిక ల్లో సూక్ష్మపోషకాల లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు ఎక్కడ కూడా పంట నేలల సహజత్వాన్ని కాపాడే ప్రయత్నం చేయకుండా తాత్కాలిక ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. జిల్లాలోని 12 మండలాల్లో అత్యధిక మండలాల్లో జింక్, బోరాన్, ఐరన్ సల్ఫర్, కాపర్, మాంగనీస్, పొటాషియం లోపాలు గణనీయంగా లోపిస్తున్నాయి. ఇప్పటికే నత్రజని 91 శాతం ఉన్నప్పటికీ రైతులు మోతాదుకు మించి వినియోగిస్తూ పంటలను చీడపీడల పాల్జేస్తున్నారని వ్యవసాయ శాస్త్రవేత్తలు అప్రమత్తం చేస్తున్నారు. పోషక లోపాలు తక్కువగా

మిగతా 8వ పేజీలో...

రేపు మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భాషబోయిన సంతోష్ అన్నారు. గురువారం హనుమ కొండలోని కేడీసీలో మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనం తరం సంతోష్ మాట్లాడుతూ... మోడల్ పరీక్షల వల్ల విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి వాటి పట్ల అవగాహన కలుగుతుందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్లో ఎప్‌సెట్, నీట్ కోచింగ్‌లను ఏర్పాటు చేయా లన్నారు.అకాడమీ లు, ప్రైవే టు జూనియర్ కళాశాలలు కోచింగ్‌ల పేరిట విద్యార్థుల నుంచి రూ.లక్షలు వసూల్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, జి. సుజాత, ఎ.అవినాష్, చిట్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేడీసీలో మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కలెక్టరేట్ నుంచే పర్యవేక్షణ

● కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నంబర్ల ఏర్పాటు ● 24 గంటలు అందుబాటులో సిబ్బంది

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18: జిల్లాలో ఎన్నికల పర్యవేక్షణ అంతా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే సాగుతోంది. అధికార యంత్రాంగం అంతా ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నారు. జిల్లాలో ఏ మూలకు ఏం జరిగినా ఇట్టే పసిగట్టి తగిన చర్యలు తీసుకునేందుకు కట్టుదిట్టమై ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని ఇప్పటికే కలెక్టర్ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రతీ ఒక్కరిని జాగు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో నాయకులు ప్రచారంపై దృష్టి సారించారు. ఈ సమయంలో పౌరులతోపాటు నాయకులకు పలు సందేహాలు వస్తుంటాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి, అతిక్రమణలపై ఫిర్యాదు చేసేందుకు ఎవరికి సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతుంటారు. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం సందేహాల నివృత్తి, ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టింది. ఓటరు జాబితాలో తమ పేరు ఉందా లేదో తెలుసుకోవాలన్నా, సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు గురి చేసినా, ఓట్లు దండుకోవడానికి డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నా, ప్రచార సమయంలో గొడవలు తలెత్తే అవకాశం ఉన్నా టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలిస్తారు. అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎలాంటి ఫిర్యాదులైనా టోల్ ఫ్రీ నెంబర్ 1950కు ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించారు.



సి విజిల్‌పై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన బ్యానర్

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో అధికారులు టోల్‌ఫ్రీ నెంబరు అందుబాటులోకి తెచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఎక్కువశాతం ఓటర్ల జాబితాకు సంబంధించి ఫిర్యాదులను వస్తున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే రాజకీయ పార్టీల నాయకులు ఒకరిని మించి మరొకరు ఎత్తుగడలు వేసే అవకాశం ఉంది. అప్పటి నుంచి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకోవడం షరామామూలే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమణ, మద్యం, నగదుతోపాటు వివిధ రకాల బహుమతులు, కానుకలు అందించే అవకాశాలు ఉంటాయి. దీంతో ఫిర్యాదులు సైతం పెరుగుతాయి. ప్రచార సందర్భాల్లో గొడవలు, దాడులు చోటు చేసుకునే సందర్భాల్లో ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో టోల్ ఫ్రీ నెంబరు 1950కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

24 గంటలు అందుబాటులో

ఎన్నికల సమయంలో ఫిర్యాదులను స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. అధికారులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. ఏ సమయంలోనైనా ఫిర్యాదు స్వీకరించేందుకు సిద్ధంగా ఉంటున్నారు. కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నెంబర్ 1950, జిల్లా సమాచార కేంద్రం నెంబర్ 0870-2530811, వాట్సాప్ నెంబర్ 91542 52936లకు ఫిర్యాదు చేస్తే సకాలంలో చర్యలు తీసుకోనున్నారు. వచ్చిన ప్రతీ ఫిర్యాదును నమోదు చేయడం జరుగుతుంది. ఫిర్యాదు చేసి వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు, అడ్రస్‌తోపాటు వారి వచ్చిన సందేహం, ఫిర్యాదును నమోదు చేసుకుంటారు.

సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు..

ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లోనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు చేరుతుంది. అక్కడ నుంచి ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు చేరుతుంది. వారు 15 నిమిషాల్లో క్షేత్రస్థాయి విచారణ చేస్తారు. ఆ నివేదిక 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి వెళ్లేలా ఏర్పాటు చేశారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై 100 నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని అధికారులు తెలుపుతున్నారు. లైవ్ ఫొటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌లో ఉంచడంతో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా ఆటోమెటిగ్గా లొకేషన్ నమోదు అవుతుంది. అక్రమంగా మద్యం, డబ్బులు, బహుమతుల పంపిణీ, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన లైవ్ ఫొటోలు, వీడియోలతో సి-విజిల్ యాప్ ద్వారా పంపవచ్చు. సి-విజిల్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.


మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

మీడియా సెంటర్ ఏర్పాటు

శాసనసభ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించేందుకు కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్, మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచారం వ్యయంలో లెక్కించడం జరుగుతుంది. వార్త పత్రికలు, ఈ పేపర్‌లు, టెలివిజన్ చానల్స్, స్థానిక కేబుల్ నెట్‌వర్క్స్, సోషల్ మీడియా, ఎస్ఎంఎస్‌లు ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుంది. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకం కావడంతో మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు.

ఇంటి నుంచే నామినేషన్లు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 18: ఎన్నికల ప్రక్రియలో రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం తోడవుతోంది. ఇంటి వద్ద నుంచే సులువుగా ఓటు నమోదు చేసుకోవడం, చిరునామా మార్పు, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవడం, ఎన్నికల నిబంధనల ఉలంఘన జరుగుతుంటే వాటిపై ఫిర్యాదులు చేయడం లాంటి వెసులుబాటు ఉంది. ఇక ప్రస్తుతం నామినేషన్లను ఇళ్ల వద్ద నుంచే దాఖలు చేసే అవకాశం కూడా ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఎన్నికల రిటర్నింగ్ కేంద్రాలకు వెళ్లకుండానే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు దాఖలు చేసేందుకు ప్రత్యేక యాప్‌లను సిద్ధం చేసింది. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు మద్దతుదారులతో కలిసి ర్యాలీగా వెళ్లడం, ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకోవడం లాంటి ఖర్చుతో కూడుకున్న వాటిని తగ్గించేందుకు ప్రత్యేకంగా సువిధ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది.



సువిధ యాప్

దాఖలు ఇలా...

గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25 వరకు కొనసాగనుంది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలనుకునే వారు వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్లకు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో కొందరికి దూరం భారంగా మారుతోంది. అలాంటివారు సువిధ యాప్‌లో నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు. అయితే ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఆస్తులు, అఫిడవిట్ పత్రాలు, బలపరిచే వారి వివరాలను నమోదు చేయాలి. వీటికి కావాల్సిన పత్రాలు అందజేసిన తర్వాత నిర్ణీత సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈపత్రాలతో జిల్లా ఎన్నికల అధికారిని కలిసి మూడు సెట్లను అందించాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు వాటికి అభ్యర్థులు అందుబాటులో లేకుంటే వారి మద్దతు దారులు హాజరుకావాల్సి ఉంటుంది. వివరాలు తప్పుగా ఉంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. ఆన్‌లైన్ అవకాశాన్ని వినియోగించుకుంటే అభ్యర్థులకు కొంత సమయం, డబ్బు ఆదా అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇక అనుమతులు సులువు

ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశం నిర్వహించాలంటే ఇదివరకు తెల్లకాగితంపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు సమయం దొరికినప్పుడు అనుమతులిచ్చేవారు. ఇది తలనొప్పిగా ఉండేది. ఇప్పుడు సులువుగా మారింది. ఇందు కోసం ఎన్నకల సంఘం సువిధ యాప్‌ను ప్రవేశపెట్టింది. అనుమతుల జారీ కోసం అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. యాప్‌లో దరఖాస్తు చేస్తే అనుమతులు జారీ చేస్తారు.

అనుమతులు తప్పనిసరి

నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఇక ఎన్నికల ప్రచారం జోరుగా సాగనుంది. ప్రధాన పార్టీలు సభలు, సమావేశాలపై దృష్టి సారిస్తాయి. ర్యాలీలతో హోరెత్తిస్తారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ఎన్నికల సంఘం ప్రచార పర్వంలో నిబంధనలు విధించింది. అభ్యర్థులు ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్న ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇందుకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

48 గంటల్లోనే ప్రచార అనుమతులు

- చరవాణి గూగుల్ ప్లేస్టోర్ ద్వారా సువిధ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- సమావేశం నిర్వహించే వివరాలతో పాటు తమకు ఏ విధమైన అనుమతులు కావాలో అందులో నమోదు చేయాలి.
- అనుమతులకు సంబంధించి మీ సేవా కేంద్రంలో చలానా చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించిన చలానా రసీదు సువిధలో నమోదు చేసిన వివరాలు రిటర్నింగ్ అధికారి, అసెంబ్లీ పరిధిలోని ఏఆర్వో కార్యాలయాల్లో అందజేయాలి.
- ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తులు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లో అనుమతులు జారీ చేస్తారు. అనుమతి జారీలో జాప్యం జరిగితే..సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.


వరంగల్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిని తౌటపల్లి నర్మద, అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థి అంబోజు బుద్దయ్య.

నామినేషన్ల పర్వం షురూ..

మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభం కాగా.. తొలిరోజున వరంగల్ నియోజకవర్గానికి ముగ్గురు, మానుకోటలో ఒకరు తమ నామినేషన్లను దాఖలు చేశారు. వరంగల్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, మానుకోటలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. వరంగల్‌లో అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా అంబోజు బుద్దయ్య, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థినిగా తౌటపల్లి నర్మద ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇక మహబూ బాబాద్ స్వతంత్ర అభ్యర్థిగా మరిపెడ మండలం ఎడ్జర్ల శివారు గుర్రపు తండాకు చెందిన బానోత్ లింగ్యానాయక్ తొలి నామినేషన్ వేశారు.


మహబూబాబాద్‌లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బానోత్ లింగ్యానాయక్

నేడు మానుకోటకు సీఎం


మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో సిద్ధమవుతున్న జనజాతర సభావేదిక


మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో పోలీస్ బందోబస్తు కోసం అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

(5వ పేజీ తరువాయి)

తొలి పార్లమెంట్ సభ్యుడిగా 2009లో గెలిచిన పోరిక బలరాంనాయక్ అప్పటి యూపీఏ ప్రభుత్వంలో కేంద్రసామాజిక న్యాయశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత తెలంగాణ ఆవిర్భావంతో ఉద్యమ పార్టీగా బరిలో దిగిన బీఆర్ఎస్ అభ్యర్థులపై రెండుసార్లు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మార్పుకోరిన తెలంగాణ ప్రజల ఓటరు నాడికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభంజనంలో మళ్లీ పార్లమెంట్ స్థానానికి పోటీ పడుతున్నారు. రేవంత్‌రెడ్డి సీఎం కాకముందు నుంచే పోరిక బలరాంనాయక్‌కు ఆత్మీయుడిగా కొనసాగారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే ఒకట్రెండు సభల్లో ఉదహరించారు. దీంతో పాటు సెంటిమెంట్‌గా అటు మహబూబ్‌నగర్ నుంచి ఇటు మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార జనజాతర సభలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకావడం, వ్యూహాత్మకంగానే ఈరెండు స్థానాలను ఎంచుకున్నారని భావిస్తున్నారు. ఇక ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పోలీస్ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మానుకోట పట్టణం ఎన్టీఆర్ స్టేడియంలోని సభాస్థలి, హెలిప్యాడ్, పోలీస్‌బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల..

సీఎం రేవంత్‌రెడ్డి సభ విజయవంతానికి రెండ్రోజులుగా మహబూబాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, మానుకోట పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వరరావు సభ ఏర్పాట్లను చూస్తున్నారు. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేసేం దుకు కసరత్తు పూర్తి చేశారు. మండుటెండల్లో నిర్వహిస్తున్న సభకు హాజరయ్యే వారికి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించడంతో పాటు నీడ కోసం షామియానాలు కూడా వేశారు. శ్రీరామనవమి సందర్భంగా మహబూబాబాద్ గాంధీపార్కులో జరిగిన ఉత్సవాలకు హాజరైన ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి కూడా తొలుత సీఎం సభ ప్రాంగణాన్ని పరిశీలించి వెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు అటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, తదితరులతో సమన్వయం చేసుకుంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశాలు నిర్వహించి సీఎం సభ విజయవంతానికి ఏర్పాట్లు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతుండడంతో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

ఆట మొదలైంది..

(5వ పేజీ తరువాయి)

పాగా వేయాలని కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నారు.

కంచుకోటపై గులాబీ గురి

పదేళ్లుగా బీఆర్ఎస్‌కు ఉమ్మడి వరంగల్ కంచుకోటలా ఉంది. ఏ ఎన్నికలు జరిగినా ఓరుగల్లులో ఆపార్టీదే హవా.. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ కేడర్‌లో కొంత నైరాశ్యం నెలకొంది. దీనికి తోడు వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైనా కడియం కావ్య కాంగ్రెస్‌లోకి జంప్ కావడం శ్రేణుల్లో మరింత నిరుత్సాహం నింపింది. అయితే ఏప్రిల్ 1న హనుమకొండలో జరిగిన వరంగల్ లోక్‌సభ స్థాయి సమావేశంలో నేతల ప్రసంగాలు వారిలో ఉత్సాహం నింపాయి. బీఆర్ఎస్‌కు కడియం శ్రీహరి ద్రోహం చేశారని రగిలిపోతున్న కేడర్ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుని ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌ను వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవితను అధిష్ఠానం ఖరారు చేయడంతో పాటు ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులను అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలుగా నియమించింది. ఇప్పటికే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించిన బీఆర్ఎస్ శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శ్రేణుల సమావేశం ఏర్పాటు చేసింది. అలాగే మిగతా అన్ని నియోజక వర్గాల్లో కార్యకర్తల సమావేశాలతో ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్‌కు ధీటుగా ప్రచారం చేయాలని వ్యూహ రచన చేస్తున్నారు. మొత్తానికి నామినేషన్ల ఘటం మొదలు కావటంతో ఓరుగల్లులో రాజకీయాలు వేడెక్కబోతున్నాయి.

బిడ్డపై ఆరాటమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదు..

● ఉద్యకారులను జైలులో వేసిన ఘనత కడియం శ్రీహరిది.. ● బీజేపీ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

హనుమకొండ టౌన్, ఏప్రిల్18: బిడ్డపై ఆరాటమే తప్ప.. ఎమ్మెల్యేగా గెలిపించిన స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఎలాంటి ప్రేమ లేదని బీజేపీ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు మండిపడ్డారు. గురువారం హంటర్‌రోడ్డులోని బీజేపీ వరంగల్ లోక్‌సభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. బీజేపీ గెలిస్తే పెద్ద ప్రమాదం జరుగుతుందని రాజ్యాంగంపై అవగాహన లేకుండా కడియం పిచ్చికూతలు కూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం విద్యావేత్త అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తనకున్న అధికారంతో జిల్లా ఎస్పీలు, కమిషనర్‌లను హెచ్చరించి ఉద్యమకారులను జైల్లో పెట్టించాడని ఆరోపించారు. బీజేపీ దళిత ద్రోహి అని పదే పదే చెబుతున్న కడియంకు.. పరకాల నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా జైపాల్ మాదిగను నిలబెట్టింది బీజేపీనే అన్న విషయం మరువొద్దన్నారు. లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 77శాతం మంది ప్రాతినిధ్యం వహిస్తున్నా రనే విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. దొర కాళ్ల పట్టుకొని బీఆర్ఎస్‌లో చేరి తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన చరిత్ర శ్రీహరిది అని ధర్మారావు ధ్వజమెత్తారు. డబ్బులకు లాలూచీ పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. పార్టీ మారినప్పటికీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడని అన్నారు. శ్రీరామ నవమిని దేశవ్యాప్తం గా కన్నులపండువగా నిర్వహించుకుంటే.. మూఢత్వం అం టూ కొంతమంది విమర్శలు చేస్తున్నారని, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్న వ్యక్తులను పాకిస్తాన్‌కు తరలించాలని ధర్మారావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ప్రభారీ మురళీ, బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, శ్రీధర్, రావు పద్మ, జైపాల్, కీర్తిరెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మారావు

భద్రకాళి సన్నిధిలో అరూరి పూజలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 18: చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయం లో వరంగల్ లోక్‌సభ బీజే పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరూరి రమేష్ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రచార పర్వం ప్రారంభం కావడంతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరూరి.. తన ప్రచార వాహనాలకు వాహన పూజ లు నిర్వహించారు. ప్రచార పర్వం ప్రారంభిస్తున్న నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి, మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో ప్రచారం నిమిత్తం పూజ తర్వాత వాహనాలు బయల్దేరి వెళ్లాయి.


ప్రచార వాహనాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అరూరికి చిన్న మెదడు చితికింది..

● రాజకీయాలను అడ్డం పెట్టుకుని భూ కబ్జాలకు పాల్పడ్డాడు.. ● ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందిస్తా..
● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ● వర్ధన్నపేటలో వరంగల్ లోకసభ సన్నాహక సమావేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 18: వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ చిన్న మెదడు చితికిందని, అందుకే మతి తప్పి మాట్లాడుతున్నాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎద్దేవా చేశారు. గురువారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని 'డీ' కన్వెన్షన్ హాలులో వర్ధన్నపేట వరంగల్ లోక్‌సభ ఎన్నిక సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీహరి మాట్లాడారు. తన తాత, తనతో పాటు కూతురు కడియం కావ్య పర్వతగిరిలోనే జన్మించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కొందరు వక్రీకరిస్తూ ఇష్టారాజ్యంగా మాట్లాడు తున్నారని అరూరి రమేశ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా రమేశ్‌కు బుద్ధి రాలేదన్నారు. కబ్జాదారులు, గుంటనక్క లాంటి నాయకులు అవసరమా? అని ప్రశ్నించారు. రమేశ్ వంటి దొంగలకు అవకాశం ఇస్తే దోపిడీ జరుగుతుందన్నారు. రాజకీయాల్లో సేవ చేసే దృక్పథం ఉండాలే కానీ.. దోచుకునే తత్వం ఉండరాదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదమని శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాదానికి అర్థమే మారిపోతుందన్నారు. దళితులకు రిజర్వేషన్లు రద్దు అవుతాయని చెప్పారు. బీజేపీ అరాచకాలకు అడ్డుపడాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని శ్రీహరి కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గం లోని ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందించే బాధ్యత తనదని శ్రీహరి హామీ ఇచ్చారు. డాక్టరు కడియం కావ్యను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

రమేశ్ భూ బకాసురుడు..

అరూరి రమేశ్ భూ బకాసుడుని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య ఆరోపించారు. తొలి నుంచి కూడా తన జన్మస్థలం ఇతర వ్యక్తిగత విషయాలే తప్ప.. ఇంకేమీ చెప్పలేక రమేశ్ నానా తంటాలు పడుతున్నాడని అన్నారు. తన తండ్రి కడియం శ్రీహరి రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేదని, ఈ క్రమంలో అరూరి రమేశ్‌కు ఏమీ దొరకక అర్థం లేని విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. దొంగలకు అవకాశం ఇస్తే ఆగమైపోతారని ప్రజలకు సూచించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి దేశాన్ని భయందోళనలకు గురిచేస్తున్న బీజేపీని పాతాళానికి తొక్కి పెట్టాలన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచదేశాలకే దిక్సూచిగా నిలిచిందని అన్నారు. రాజ్యాంగ నిర్మాణ డాక్టరు బీఆర్ అంబేద్కర్ విశ్వవాప్తంగా కీర్తి పొందారన్నారు. కానీ బీజేపీ మాత్రం రాజ్యాంగాన్నే మారుస్తామని చెప్పడం అనైతికమన్నారు. ప్రజలు ఆలోచించాలని, దేశంలో శాంతి నెలకొనాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినీ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టరు రియాజ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

23న వరంగల్‌కు కేటీఆర్

● నియోజకవర్గాల వారీగా సమావేశాలు
● 22న సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు



రాంనగర్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ 23న వరంగల్ పర్యటనకు రానున్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ ప్రచార కార్యక్రమానికి కేటీఆర్ హాజరుకానున్నారు. 23న సాయంత్రం 4గంటలకు వర్ధన్నపేటలో జరిగే సమావేశంలో పాల్గొననున్న కేటీఆర్.. సాయంత్ర 6గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. సుధీర్‌కుమార్ 22న ఉదయం 10గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

అలాగే ఏడు నియోజకవర్గాల వారిగా ప్రచార సమావేశాలను పార్టీ ప్రకటించింది. 19న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమావేశం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఉదయం 10గంటలకు జరగనుంది. 20న ఉదయం 10గంటలకు భూపాలపల్లి నియోజకవర్గ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తారు. 20న మధ్యాహ్నం 2గంటలకు పరకాల నియోజకవర్గ సమావేశం నియోజకవర్గ కేంద్రంలోని లలితా కన్వెన్షన్‌లో జరుగుతుంది. 23న సాయంత్రం 4గంటలకు వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశం నియోజకవర్గ కేంద్రంలో జరుగుతుంది. 23న సాయంత్రం 6గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశం వరంగల్‌లో నిర్వహించనున్నారు. 25న ఉదయం 10గంటలకు పాలకుర్తి నియోజకవర్గ సమావేశం రామ ఉపేందర్ గార్డెన్స్ తొర్రూరులో నిర్వహించనున్నారు.

ఆర్టీసీ సిబ్బంది రోజూ రూ.లక్ష తీసుకురావాలి

ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత

న్యూశాయంపేట, ఏప్రిల్ 18: ఆర్టీసీలో నూతనంగా 'లక్షే లక్ష్యం' అనే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వరంగల్-1డిపోలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్ఎం శ్రీలత మాట్లాడుతూ.. రీజియన్ పరిధిలోని డిపోల సిబ్బంది ఇక నుంచి రోజుకు రూ.లక్ష ఆదాయాన్ని అదనంగా తీసుకురావాలన్నారు. డిపో 1 పరిధి పెద్దగా ఉన్నందున రోజుకు సిబ్బంది రూ.1,80,000 తీసుకురావాలన్నారు. సిబ్బంది సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో 1 మేనేజర్ వంగాల మోహన్‌రావు, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సంతోష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత

అధ్వానంగా రైతు వేదికలు



పాలకుర్తిలోని రైతువేదిక భవనం

- నిధులు రాక నిర్వహణ భారం
- జిల్లాలో పెండింగ్ బిల్లులు రూ.66.96 లక్షలు

పాలకుర్తి, ఏప్రిల్ 18: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులకు వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2017-18 సంవత్సరంలో రైతు వేదికల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే ఏడాది నుంచి వాటి నిర్వహణ నిధుల లేమితో అధ్వానంగా తయారైంది. జనగామ జిల్లాలోని 12 మండలాల్లో 62 రైతు వేదికల భవనాలకు ఒక్కో దానికి రూ.20లక్షలకు పైగా నిధులు మంజూరి చేసి నిర్మాణం చేపట్టింది. ఒక్కో రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం రూ.9వేలు అందిస్తోంది. గత ఏడాది మార్చి వరకు నిధులు రాగా, ఏడాది నుంచి మంజూరు కావడం లేదు. రైతు వేదికలకు ప్రభుత్వం రూ.66లక్షల 96వేలు చెల్లించాల్సి ఉంది. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతుల గురించి తెలుసుకునేందుకు సమావేశాలు నిర్వహించేందుకు ఈ నిధులను వినియోగిస్తారు. అలాగే నియోజకవర్గంలోని ఒక వేదికకు నూతన టెక్నాలజీతో పాటు టెలికాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలతో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు పరికరాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏడాది నుంచి నయా పైసా ఇవ్వకపోవడంతో వాటి నిర్వహణ అధికారులకు భారంగా మారింది.

నిధుల వినియోగం ఇలా..

రైతు వేదికలకు ప్రభుత్వం నెలకు రూ.9వేలు కేటాయిస్తుంది. అట్టి నిధులను ఇలా ఖర్చు చేయాల్సి ఉంది. రైతులకు తాగునీటి బిల్లు రూ.500, విద్యుత్ బిల్లు రూ.1000, పారిశుధ్యం కోసం రూ.3వేలు, స్టేషనరీ, జిరాక్స్ చార్జీలకు రూ.1000, రైతులకు శిక్షణకు రూ.2,500, భవన మరమ్మతులకు రూ.1000 ఖర్చు చేయాల్సిఉంది.

నియోజకవర్గానికి ఒక రైతువేదిక ఎంపిక

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మంగళవారం నియోజకవర్గంలోని ఒక రైతు వేదికను ఎంపిక చేసింది. వ్యవసాయ రంగం పట్ల నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. వాటిలో కంప్యూటర్లతో పాటు వైఫై, పర్నిచర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్‌లోని రైతులతో మాట్లాడుతూనే సూచనలు, సలహాలు ఇచ్చేందుకు రైతు వేదికను ఎంపిక చేసింది.

ఏడాది నుంచి అందని నిధులు

ఏడాది నుంచి నిధులు విడుదల కాకపోవడంతో రైతు వేదికల నిర్వహణ అధికారులకు కష్టంగా మారింది. జిల్లాలో ఒక్కో రైతు వేదికకు రూ.1లక్షా 8వేలు రావల్సి ఉండగా ఇంత వరకు మంజూరు కాలేదు. జిల్లాలోని మొత్తం 62 రైతు వేదికలకు రూ.66లక్షల 96వేలు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఆయా ఖర్చులను ఏఈవోలు స్వంత భరిస్తూ రైతు వేదికలను నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా..

వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి



జిల్లాలోని రైతు వేదికలకు గత ఏడాది నుంచి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో నిర్వహణ కష్టంగా మారింది. ఏఈవోలు స్వంతంగాఖర్చులు భరించి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈవిషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు : ఆర్డీవో



ఆర్డీవో కార్యాలయం వద్ద ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను అంటిస్తున్న ఆర్డీవో

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 18 : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తెలిపారు. ఎన్నికల కమిషన్ గురువారం పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయగా సంబంధిత నోటిఫికేషన్ పత్రాలను ఆర్డీవో తన కార్యాలయం వెలుపల అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలోఇప్పటికే వివిధ టీమ్‌లు పర్యటిస్తున్నాయని తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు వివిధ పార్టీల నాయకులు అనుమతులు తీసుకొని ప్రచారాలను నిర్వహించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అర్జున్ పాల్గొన్నారు.

ప్రైవేటు క్లినిక్‌లో ఔషధాల సీజ్

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18: జనగామ పట్టణంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌పై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు దాడులు జరిపి మందులను సీజ్ చేశారు. సూర్యాపేట రోడ్డులో నిర్వహిస్తున్న క్లినిక్‌లో గురువారం ఔషధ నియంత్రణ శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ ఎ.బాలక్రిష్ణ, ఎం.అరవింద్ దాడులు జరిపి 43 రకాల రూ.45వేల విలువ చేసే అలోపతి మందులు సీజ్ చేశారు.

డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లకు ఆహ్వానం

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18 : హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణా సంస్థలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో అడ్మిషన్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జయంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పాక్షిక అనాథ బాలికలు, పేదరికంలో ఉన్న బాలికలు, అక్రమ రవాణాకు గురైన, సంరక్షణ కేంద్రంలో ఉన్న, మహిళా సంస్థలో ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదవ తరగతి పూర్తి చేసినటువంటి బాలికలు ఎటువంటి అర్హత పరీక్ష లేకుండానే పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో చేరవచ్చన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాలికలు మే 15వ తేదీ లోగా జనగామ కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వైభవంగా మహా పూర్ణాహుతి

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18 : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లా కేంద్రంలోని పాతబీటు బజారులో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 17న స్వామి వారి కల్యాణం నిర్వహించగా గురువారం పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. అన్నదానం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, పోకల వేణు, అయితా సోమ హనుమంతరావు, బచ్చు అశోక్, నందు బజాజ్, బుస్సా పాండు తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18 : జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఇతర క్రీడల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ఉత్సాహవంతులైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు ఈ నెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9182552593 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ చేయాలి : కలెక్టర్



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18: నియోజకవర్గాల వారిగా ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం జనగామలోని కలెక్టరేట్ ఎలక్షన్ సెల్‌లోని ఎన్నికల సామగ్రిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం ఎన్నికల సామగ్రిని పకడ్బందీగా పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల సామగ్రి నోడల్ అధికారి కుమారస్వామి, ఏవో రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంను పరిశీలించిన ఏఆర్‌వో రోహిత్‌సింగ్

పాలకుర్తి, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అదనపు కలెక్టర్, ఏఆర్‌వో రోహిత్‌సింగ్ పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూంను గురువారం సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను అధికారులు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంను మొత్తం కలియ తిరిగినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో ఎలాంటి ఘటనలు చోటుచేసు కోకుండా పోలీసు అధికారులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశం, ఎస్సై సాయి ప్రసన్నకుమార్, ఎన్నికల డీటీ రామరావు తదితరులు పాల్గొన్నారు.

పౌరుడి చేతిలో సమాచార హక్కు చట్టం తిరుగులేని అస్త్రం

- తెలుగు రాష్ట్రాల మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వెంకటేశ్వర్లు



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18 : పౌరుడి చేతిలో సమాచార హక్కు చట్టం తిరుగులేని అస్త్రంగా ఉంటుందని ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. జనగామలోని విజయ ఫంక్షన్ హాల్‌లో గురువారం ప్రేమ సేవా సదనం నేతృత్వంలో, సమాచార హక్కు సేవా సమితి ఆధ్వర్యంలో 'సమాచార హక్కు చట్టం-2005 ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ'పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రేమ సేవా సదనం డైరెక్టర్ మహమ్మద్ ఖుర్షీద్ పాషా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వం కలిగి ఉండాలన్నారు. ఈ చట్టంపై అవగాహన ఉంటే ఎలాంటి సమస్యలు రావన్నారు. 2005లో కాంగ్రెస్ పార్టీతోనే ఈ చట్టం సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డిని గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో ఆర్‌టీఐ దరఖాస్తులను స్వీకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలోసమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్టు కన్నా పరశురాములు, చింతకింది వెంకటేశ్వర్లు, నీలం రవి, ఉమాపతి పాల్గొన్నారు.

సమాచార హక్కు మండల అధ్యక్షుడిగా నాగరాజు



లింగాలఘణపురం, ఏప్రిల్ 18 : సమాచార హక్కు వికాస సమితి మండల అధ్యక్షుడిగా లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన గూటం నాగరాజును నియమిస్తూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు యరమాద కృష్ణారెడ్డి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో సమాచార హక్కు వికాస సమితి మండల బాధ్యతలను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కుపై మండల ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

మడేలయ్య గుడి నిర్మాణానికి భూమిపూజ

చిలుపూర్, ఏప్రిల్ 18 : మండలంలోని కొండాపూర్ గ్రామంలో మడేలయ్య గుడి నిర్మాణ పనులకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లోడెం రవిందర్ భూమిపూజ చేశారు. గురువారం రజక సంఘం నాయకులు వెలిశాల అనిల్, కనకయ్య నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవిందర్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారమందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సందీప్, యాదయ్య, రాజయ్య, నేరేళ్ల యాదయ్య, శంకర్, కనకయ్య, హరీష్, రవికుమార్, కొండ తిరుపతి, గుల్ల ప్రకాశ్, వెంకట్‌రెడ్డి, చొక్కం కుమార్ పాల్గొన్నారు.

సీపీఎం సభకు ప్రజలు తరలిరావాలి

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18 : భువనగిరి పార్లమెంటు సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్ నామినేషన్‌సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. వీర తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ పోరాటానికి కేంద్ర బిందువైన భువనగిరి నియోజకవర్గం నుంచి పార్లమెంటులో ఎర్రజెండా ప్రాతినిధ్యం ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బీజేపీ మతోన్మాదాన్ని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలన్నారు. భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నేత సాంబరాజు యాదగిరి, సుంచు విజేందర్, బాల్నె వెంకటమల్లయ్య పాల్గొన్నారు.

టెట్‌కు ఉచిత శిక్షణ

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18 : టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో టెట్-2024కు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్, కౌన్సిలర్ కుర్రెముల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి నల్లనాగుల రాజు తెలిపారు. ఈ మేరకు గురువారం జనగామ జిల్లా కేంద్రంలో ఉచిత శిక్షణా తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ జిల్లా కేంద్రంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 24 నుంచి మే 11 వరకు అనుభవజ్ఞులైన విషయ నిపుణులచే టెట్‌కు శిక్షణ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కొరకు 95731 41365, 98483 62672 నంబర్లలో సంప్రదించాలన్నారు.

డీఐఈవోగా ఆంజనేయరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయరాజు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 18: జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈవో)గా కె.ఆంజనేయరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు డీఐఈవోగా పని చేసిన భైరి శ్రీనివాస్ గత నెల 31న పదవీ విరమణ చేయగా ఆయన స్థానంలో జఫర్‌గఢ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆంజనేయరాజుకు డీఐఈఓ గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ విద్యార్థులు అఫిలియేషన్ లేని కళాశాలల్లో చేరవద్దన్నారు. పూర్తి స్థాయిలో గుర్తింపు కలిగిన కళాశాలల్లో మాత్రమే చేరాలన్నారు. అన్ని వసతులు, మౌలిక సౌకర్యాలు, పూర్తి స్థాయి సిబ్బంది కలిగి ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

చిలుపూర్, ఏప్రిల్ 18 : అర్హులైన ప్రతీ కుటుంబం అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ అన్నారు. చిలుపూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం నిర్వహించిన ప్రీ స్కూల్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించడం ద్వారా వారికి అక్షరాలతో పాటు క్రమశిక్షణ, ఆట పాటలపై అవగాహన పెరుగుతుందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్స్ అందుకుంటున్న బాలయేసు పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

దేవరుప్పుల, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని బాలయేసు పాఠశాలలో చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు గురువారం ఎన్‌సీసీ-ఏ సర్టిఫికెట్స్ అందుకున్నారు. పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు 2022-24 బ్యాచ్‌కు చెందిన వారు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా 10టీ డీఎన్ ఎన్‌సీసీ వరంగల్‌కు చెందిన హవాలాదార్ విజయ్‌బిరదార్, ఉమేష్ పాస్తా అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జేసురాజ్ ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ కృష్ణ, ఉపాధ్యాయులు ఖాజా, మహేష్ సరిత, మాధవి, అనిత, విజయలక్ష్మి, పాషా పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

- వరంగల్ సీపీ అంబర్‌కిశోర్ ఝా



పాలకుర్తి పీఎస్‌లో వివరాలు తెలుసుకుంటున్న సీపీ

పాలకుర్తి, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల్లో పోలీసు సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని వరంగల్ సీపీ అంబర్‌కిశోర్ ఝా అన్నారు. పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో ఎన్నికల నిర్వహణ గురించి సీఐ మహేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించినట్లుగానే పార్లమెంటు ఎన్నికల్లో పనిచేయాలని సూచించారు. పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు బాగుందని, కేసులు పెండింగ్‌లో ఉంచకూడదని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను కలియ తిరిగారు. సీపీ వెంట ఎస్సైలు సాయిప్రసన్నకుమార్, లింగారెడ్డిలు ఉన్నారు.

ఠాణాను తనిఖీ చేసిన సీపీ

దేవరుప్పుల : దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌ను గురువారం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికలు సమీపిస్తున్నందున స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలతో మాట్లాడారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే విషయంలో పోలీసుల పాత్ర కీలకమని, శాంతిభద్రతల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫెయిల్ అవుతానేమోనని విద్యార్థి ఆత్మహత్య



వంశీ (ఫైల్)

పాలకుర్తి, ఏప్రిల్ 18 : ఇంటర్మీడియట్ పరీక్షలో మరోసారి ఫెయిల్ అవుతానేమోనని భయంతో ఓ విద్యార్థి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్న సంఘటన గురువారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపిన ప్రకారం.. పాలకుర్తికి చెందిన ఈరంటి వంశీ(19) గత సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. ఇంటి వద్ద ఉంటూనే ఇటీవల సప్లమెంటరీ పరీక్ష రాశాడు. అయినా ఫెయిల్ అవుతానేమోననే భయంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని చనిపోయాడు. తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతుల ఆందోళన

బచ్చన్నపేట, ఏప్రిల్ 18: ట్రాన్స్‌పార్మర్ కాలిపోయి 16 రోజులు గడిచినా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని మండలంలోని ఆలీంపూర్ రైతులు గురువారం నిరసన తెలిపారు. గ్రామ శివారులోని మ్యాక యాదగిరి వ్యవసాయ క్షేత్రం వద్ద ఎస్ఎస్ 148 ట్రాన్స్‌పార్మర్ ఉంది. 16 రోజుల క్రితం కాలిపోగా, అధికారులకు తెలిపిన పట్టించుకోలేదని ఎలికట్టె సునీత, కళమ్మ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో ఎక్కించి బచ్చన్నపేట సబ్‌స్టేషన్ మరమ్మతు కేంద్రానికి తరలించినట్టు తెలిపారు. ఈవిషయమై లైన్‌మన్ జలందర్‌ను వివరణ కోరగా ట్రాన్స్ ఫార్మర్ మ్యాక యాదగిరి అనే రైతు వ్యవసాయ పొలంలో ఉండడంతో గురువారం వరకు వేచిచూడాల్సి వచ్చిందన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

బచ్చన్నపేట, ఏప్రిల్ 18 : మండలంలోని కొడవటూరులో ఇటీవల నలుగురు వ్యక్తులు మృతి చెందగా ఆయా కుటుంబాలను సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. నడిగట్టు మల్లయ్య, మేక ఎర్ర బీరుమల్లయ్య, ఆత్కూరి మల్లమ్మ, ముక్కెర ఐలయ్యలు మృతి చెందారన్నారు.

కావ్యపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 18: ప్రభుత్వాలు కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తుంటే కొందరు నాయకులు రాజకీయంగా కడియం కావ్యను ఎదుర్కోలేక అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సహించమని కులాంతర వివాహ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెసరు సారయ్య హెచ్చరించారు. గురువారం డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాంతర వివాహం చేసుకున్న మహిళలకు వారి తండ్రి కులం వర్తిస్తుందనే కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. కులాంతర వివాహం చేసుకొని అనేక మందికి ఆదర్శంగా నిలిచిన కడియం కావ్యను కించపరిచేలా మాట్లాడుతున్న వారికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకుడు చిలగాని రాకేష్, మండలాధ్యక్షుడు సముద్రాల రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, మునిగెల రాజు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గట్టు రమేష్, అంబటి కిషన్‌రాజ్, స్వామినాయక్, గుర్రం ఫాతికుమార్, ఎమ్డీ.కలీం తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

రఘునాథపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని గోవర్దనగిరి, ఖిలాషాపూర్, కుసుంబాయి తండా గ్రామ పంచాయతీల పరిధిలో తాగు నీటి సరఫరాతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన పనులను అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండా కాలంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పక్కాప్రణాళికతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, గేటు తదితర మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ఎస్డీఎఫ్ కింద మంజూరైన మిషన్ భగీరథ పైపులైన్ పనులను పర్యవేక్షించి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాము, ఎంపీడీవో శ్రీనివాసులు, డీఈ శ్రీనివాస్, ఏఈ లక్ష్మిపతి పాల్గొన్నారు.

భూనిస్సారం!

(5వ పేజీ తరువాయి)

ఉన్న వాటిపై దృష్టి సారించకుండా మూస పద్ధతి సాగు విధానంతో నేలల్లో నైట్రిక్ ఆమ్లాలు పెరిగి ఆమ్లత్వ నేలలుగా విచ్ఛిన్నమతుండటం గమనార్హం.

జిల్లాలో సూక్ష్మపోషక విలువలిలా..

జనగామ జిల్లాలోని 12 మండలాల్లో సూక్ష్మపోషక విలువలను గమనిస్తే ఆర్గానిక్ కార్బన్-63 శాతం, నత్రజని- 91 శాతం, భాస్వరం-20 శాతం, పొటాషియం-4 శాతం, జింక్-75 శాతం, బోరాన్- 61 శాతం, ఐరన్-59 శాతం, సల్ఫర్- 35 శాతం, మాగనీస్- 45 శాతం, కాపర్-51 శాతం, మెగ్నీషియం-50 శాతం, మాలిబ్దినం-50 శాతం ఉన్నాయి. అయితే నాణ్యమైన పంట దిగుబడికి అవసరమైన పొటాషియం జిల్లాలో కేవలం 4 శాతం మాత్రమే ఉండటం వల్ల పంట దిగుబడిని కోల్పోవడంతో పాటుగా తాలు శాతం పెరిగిపోతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పోషకాలతో పటిష్ఠం

ప్రధానంగా మొక్కకు 16 రకాల పోషకాలు అందినప్పుడే మొక్క ఎదుగుదల పటిష్ఠంగా ఉండటంతో పాటుగా దిగుబడి లాభదాయకంగా ఉంటుంది. వాటిలో సమతుల్యం లోపించినప్పుడే పంట దిగుబడిపై ప్రభావం చూపడమే కాకుండా నేల స్వభావం కోల్పోనున్నట్లు వ్యవసాయ శాఖ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. వాటిలో జింక్, బోరాన్, ఐరన్, మాంగనీస్, పాస్పరస్, పొటాషియం, నైట్రోజన్, కాల్షియం, కాపర్, సల్ఫర్, మెగ్నీషియం, మాలిబ్దినం, క్లోరిన్, కార్బన్, హైడ్రోజన్, ఆక్సీజన్ అవసరం ఉంటుంది. వీటిలో అత్యధిక శాతం పోషకాల్లో సమ తుల్యత లోపించడం గమనార్హం.

రైతన్న అప్రమత్తం కావాలి

ప్రతీ ఏటా మట్టి నమూనాల ద్వారా నేల స్వభావాన్ని తెలుసుకొని వాటిని సమతుల్యంగా కాపాడుకున్నప్పుడే నేల తన సహజతత్వాన్ని కోల్పోకుండా ఉంటుంది ఇందుకు ప్రధానంగా అన్నదాత అవగాహన కలిగి ఉన్నప్పుడు మాత్రమే సాధ్యపడుతుంది. నేలనుఆరోగ్యంగా కాపాడుకునేందుకు రైతులు రసాయన విధానానికి విరామం పలికి సేంద్రీయ సాగు విధానంపై దృష్టి సారిస్తే భూసారం పెరిగి నేల కాలుష్యం, నీటి కాలుష్యం తగ్గే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఉదజని సూచిక 6.6- 7.4 ఉన్నప్పుడే ఆ నేలలు సాగుకు అనుకూలం. పీహెచ్ వ్యాల్యూ (ఉదజని సూచిక) 6.6కు తక్కువగా ఉంటే ఆమ్ల నేలలుగా, 7.4 కంటే ఎక్కువగా ఉంటే అవి క్షార నేలలుగా మారి మొక్కల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపే పరిస్థితులు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

అధిక ఎరువుల వాడకంతో దుష్పరిణామాలు

వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి, లింగాలఘణపురం



జిల్లాలో రైతులు ప్రధానంగా మోతాదుకు మించి ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా పంటల దిగుబడిపై కూడా ప్రభావం పడుతుంది. నత్రజని జిల్లాలో ఇప్పటికే 91 శాతం ఉన్నప్పటికీ రైతులు అవసరం లేకపోయినా అధికంగా యూరియాను వాడుతుండటం వల్ల మొక్క ఎదుగుదల విపరీతంగా పెరిగి ప్రతికూల పరిస్థితుల నుంచి తట్టుకునే శక్తిని కోల్పోతుంది. మొక్కల్లో వ్యాధినిరోధక శక్తిని గణనీయంగా పెంచే పొటాషియం 4 శాతం మాత్రమే ఉండటం వల్ల దాన్ని ఎక్కువగా వినియోగించాల్సిన అవసరం ఉంది. భూసారాన్ని పెంచుకునేందుకు ఆర్గానిక్ కార్బన్ వినియోగించాల్సిన అవసరం ఉంది.

తనిఖీల్లో పట్టుబడిన నగదు



శివునిపల్లిలో పోలీసులు పట్టుకున్న నగదు

స్టేషన్ ఘన్ పూర్, ఏప్రిల్ 18 : మండలంలోని శివునిపల్లిలో ఘన్‌పూర్-పాలకుర్తి రోడ్డుపై ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీల్లో భాగంగా గురువారం పోలీసులు రూ.లక్ష నగదును పట్టుకున్నారు. సీఐ ముస్కు రాజు తెలిపిన ప్రకారం... మండలంలోని మాన్‌సింగ్ తండాకు చెందిన భూక్య రవీందర్ బైక్‌లో రూ.లక్ష నగదును ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సంబంధిత డబ్బులను ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించడం జరుగుతుందన్నారు. సరైన పత్రాలను చూపి తే బాధితులకు నగదును అప్పగించనున్నట్లు తెలిపారు. నిబంధనల మేరకు డబ్బులు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, ఏఎస్సై రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపేటలో రూ.1.49 లక్షలు

చిలుపూర్ : మండలంలోని వెంకటాద్రిపేటలో గురువారం చేపట్టిన వాహన తనిఖీల్లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి నుంచి రూ1.49లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని గురువారం తరిగొప్పుల-చిన్నపెండ్యాల ప్రధాన రహదారిపై చిలుపూర్ ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని వడ్డెరగూడెంకు చెందిన కస్తూరి వెంకట్రాజం బైక్‌ను తనిఖీ చేయగా రూ.1.49 లక్షల నగదు లభించగా, స్వాధీనం చేసుకుని ముగ్గురు సభ్యులతో కూడిన అధికారుల బృందానికి అప్పగించామని పేర్కొన్నారు.